

**వారెన్ బఫెట్..**

**ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరు.. స్టాక్ మార్కెట్‌లో మదుపు చేసేవారందరికీ ఆదర్శం.. మరి.. విజయవంతమైన పెట్టుబడిదారుడిగా మారేందుకు ఆయన అనుసరించిన వ్యూహాలేమిటి? పాటించిన సూత్రాలేమిటి? మనమూ తెలుసుకుందామా!**

# మదుపు బాటలో.. బఫెట్ పాఠాలు!

స్టాక్ మార్కెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం అసాధ్యం. కానీ, ఆ ఆటుపోట్లలోనే అంతులేని సంపద దాగుందనీ, ఎటొచ్చీ దాన్ని అందుకునేందుకు కిటుకులు తెలిస్తే చాలని నిరూపించిన వ్యక్తి వారెన్ బఫెట్. ఆయన ప్రతి మాటా పెట్టుబడిదారులకు ఓ మార్గనిర్దేశనం. ఆయన అనుసరించిన వ్యూహాలేమిటో తెలుసుకుని.. అందులో కొన్నైనా పాటిస్తే.. మీరూ ఒక విజయవంతమైన మదుపరిగా మారేందుకు వీలుంది.

✤ బఫెట్ ప్రతి పెట్టుబడినీ ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచిస్తాడు. ఆయన పాటించే ప్రధాన సూత్రాలు రెండు. ఒకటి పెట్టుబడిని నష్టపోకూడదు. రెండు.. మొదటి సూత్రాన్ని మర్చిపోకూడదు. ఈ రెండు నియమాలే తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణం అని ఎప్పుడూ చెబుతుంటారు.

✤ తనకు అవగాహన లేని వ్యాపారాల జోలికి వారెన్ బఫెట్ వెళ్లడు. కొందరికి కొన్ని రంగాలపై అవగాహన ఉంటే మరి కొందరికి ఇంకొన్నింటిపై ఉంటుంది. ఆయా రంగాల్లో వారికి అన్ని విషయాలనూ విశ్లేషించే సామర్థ్యం ఉంటుంది. పెట్టుబడి పెట్టేటప్పుడు అలా మీకు అవగాహన ఉన్న రంగంలోని పరిశ్రమలనే ఎంచుకోవాలి. అప్పుడు మీ పెట్టుబడిని కాపాడుకోవడం ఎలాగో మీకే తెలుస్తుంది.

✤ పోటీతత్వంలో కూడా ప్రత్యేక శక్తిసామర్థ్యాలతో మెరుగైన పనితీరును ప్రదర్శించే కంపెనీలు త్వరగా వృద్ధి చెందుతుంటాయి. అలాంటి కంపెనీలు పెట్టుబడికి రక్షణ ఇవ్వడంతోపాటు.. వృద్ధికీ వీలు కల్పిస్తాయి. తక్కువ ఖర్చుతో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించగలిగే కంపెనీలు లేదా విశ్వవ్యాప్త గుర్తింపు ఉన్న బ్రాండ్ల కంపెనీలను గుర్తించగలగాలి. అలాంటి కంపెనీల్లో పెట్టుబడులు మంచి వృద్ధిని సాధిస్తాయి.



**సతీష్ కంతేటి**
**జెన్ మని**

✤ మంచి ఫలితాలను సాధించే కంపెనీల షేర్లు అనుకోకుండా కొన్ని సందర్భాల్లో అందుబాటు ధరల్లో దొరికేందుకు వీలుంటుంది. ఇలాంటప్పుడు వాటిని ఎంతమాత్రం వదులుకోకూడదు.

✤ ఒక కంపెనీని కొనాలంటే ఎలా ఆలోచిస్తారో.. ఒక కంపెనీ షేరులో పెట్టుబడి పెట్టేటప్పుడు కూడా అలాగే ఆలోచించాలి. ఒకసారి మీరు వ్యాపారాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే.. అప్పుడు ఆ కంపెనీ నాణ్యతమీద మీరే ఒక నిర్ణయానికి రాగలుగుతారు. బఫెట్ విజయ సూత్రాల్లో నాణ్యమైన కంపెనీల షేర్లను తక్కువ ధరకు కొనడం కూడా ఒకటి.

✤ అద్భుతమైన కంపెనీ షేరును సమంజసమైన ధర వద్ద కొనుగోలు చేయవచ్చు. కానీ, అంతగా పనితీరు కనబర్చని కంపెనీల షేరును మంచి ధర వద్ద కాదు.

✤ మార్కెట్‌ను అంచనా వేయడం మానేయండి. ఆర్థిక పరిస్థితులు, వడ్డీ రేట్లు, ఎలక్షన్లు మార్కెట్‌పై చూపే ప్రభావం గురించి ఆలోచించకండి. కంపెనీకి సంబంధించిన ఆర్థిక విషయాల్ని, దాని భవిష్యత్తు అంచనాల్ని, విలువను విశ్లేషించుకోండి. అన్నీ మీకు అనుకూలంగా ఉంటే ఆ షేర్లను కొనండి.

✤ నష్టభయాన్ని తగ్గించుకునేందుకు వీలుగా పెట్టుబడిని 5-10 కంపెనీల షేర్లకే పరిమితం చేయాలి. దానివల్ల ఆయా కంపెనీల గురించి మరింత పరిశోధన చేయడానికి వీలు కలుగుతుంది. చాలామంది ఆర్థిక నిపుణులు పెట్టుబడిని వైవిధ్యంగా ఉండేలా చూసుకోవాలని, దానివల్ల నష్టభయం తగ్గుతుందని చెబుతుంటారు. కానీ, బఫెట్ మాత్రం ఇంకా భిన్నంగా మదుపు చేస్తాడు. ఒక కంపెనీని ఆయన ఇష్టపడితే.. దానిలో పెద్దమొత్తంలో పెట్టుబడి పెడతాడు. ఆయన నమ్మకం ఏమిటంటే.. కంపెనీని పూర్తిగా అర్థం చేసుకుంటే ఆశించిన స్థాయిలో రాబడి వస్తుందని. మదుపర్లు కూడా ఈ విషయాన్ని గమనించాలి. మంచి అవకాశం కోసం వేచి చూసి సరైన షేరును కొనుగోలు చేయడం వల్ల నష్టభయం తగ్గడమే కాకుండా.. రాబడికి కూడా అవకాశం ఉంటుంది.

✤ మీరు చెల్లించేది ధర.. మీకు వచ్చేది విలువ అనేది గుర్తుంచుకోవాలి.

✤ ఆకర్షణీయమైన ధరల వద్ద ఉన్నప్పుడు ఆ షేరులో పెట్టుబడి పెట్టడం కీలకం. కంపెనీ విలువ కన్నా షేరు ధర తక్కువగా ఉన్నప్పుడు.. పెట్టుబడికి రక్షణ ఉంటుందని భావించినప్పుడు మాత్రమే ఆ షేరును బఫెట్ కొనుగోలు చేస్తాడు. ఏ మాత్రం నష్టభయం లేని, లేదా చాలా తక్కువగా ఉండే పెట్టుబడి గురించే ఎక్కువగా ఆలోచించాలి.

✤ మీరు పెట్టుబడిదారుడు అయితే.. కంపెనీలో ఏం జరుగుతుంది, ఏం చేయబోతుంది అన్న దానిపైనే దృష్టి పెట్టండి. స్పెక్యులేటర్ అయితే.. కంపెనీ షేరు ధర ఎలా ఉండబోతోంది అన్నది చూడండి.

✤ బఫెట్ దృష్టిలో విజయవంతమైన పెట్టుబడిదారుడు ఎవరంటే.. మిగతా వారందరూ మార్కెట్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నప్పుడు కొంచెం భయంగా ఉండేవారు. అందరూ భయంతో దూరమవుతున్నప్పుడు ఉత్సాహంగా ముందుకెళ్లే వారు. ఎక్కువమంది ఆసక్తితో ఉన్న షేరు గురించే అందరూ ఆలోచిస్తారు. ఒకేసారి ఆ షేరు మీద అందరికీ అయిష్టం ఏర్పడిందనుకోండి.. నష్టాలపాలవుతారు!

✤ వారెన్ బఫెట్ నమ్మే సిద్ధాంతాల్లో మరో ముఖ్యమైనది ఏమిటంటే.. సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటూ.. తప్పుడు నిర్ణయాలను తగ్గించుకుంటారో అప్పుడే సంపద సృష్టి సాకారమవుతుందని.

పైన చెప్పిన కీలక పెట్టుబడి సూత్రాలతో పాటు అతని వ్యక్తిగత క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం, స్థైర్యం, నమ్మకం, ఓపిక తదితర లక్షణాలతో ఒక విజయవంతమైన, పరిపూర్ణమైన పెట్టుబడిదారుడిగా బఫెట్ ఎదిగారు. ఆయన పెట్టుబడి ప్రక్రియను ఆదర్శంగా తీసుకొని మదుపర్లు వారివారి రాబడులను మరింతగా పెంచుకోగలగాలి.